క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్ (యాడికి): యాడికి మండలంలోని కమలపాడు పంచాయతీ చింతరాయపల్లిలో ఉన్న లక్ష్మీకొత్త వెంకటరమణస్వామి ఆలయంలో స్వామి వార్ల కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. స్వామివార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా పట్టువస్త్రాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి స్వామి కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

దళిత కాలనీలో తాగునీటి సమస్య



పిన్నేపల్లి ఎస్సీ కాలనీలో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిపత్రిటౌన్(యాడికి): యాడికి మండలం పిన్నేపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీ తాగునీటి సమస్య నెలకొనడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగ పూట కాలనీలోకి నీరు రాకపోవడంతో కాలనీ వాసులు అవస్థలు పడ్డారు. గ్రామానికి అధికారులు రోజు విడిచి రోజు పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నా.. దళిత కాలనీకి నీరు చేరడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలు మార్లు విన్నవించినా సమస్య పరిష్కరించడం లేదని కాలనీవాసులు వాపోయారు. చేసేది లేక కాలనీ వాసులు దాతల సహకారం కోరడంతో తూట్రాళ్లపల్లి సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు దాతృత్వంతో కాలనీకి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి పండుగ పూట కాలనీ వాసులు దాహర్తి తీర్చారు. దీంతో కాలనీ వాసులు వైఎస్సార్ సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.75 లక్షల వసూలు



ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద చెల్లింపు కేంద్రంలో బిల్లు కడుతున్న వినియోగదారుడు

తాడిపత్రి రూరల్: రెండు రోజుల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు ద్వారా రూ.76 లక్షలు వసూలైందని సోమవారం ఈఆర్‌ఓ నరసప్ప తెలిపారు. ఉగాది, రంజాన్ పండుగలకు పురస్కరించుకుని సెలవు రోజులైనా ఆదివారం రూ.25 లక్షలు, సోమవారం రూ.51 లక్షలు వసూలైందన్నారు. తాడిపత్రి పట్టణంలోని ఫీజికాల్ కార్యాలయం, ట్రాన్స్‌కో కార్యాలయం, యాడికి మండల కేంద్రం, రాయలచెరువుల్లోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలతో పాటు ఇతర మార్గాల ద్వారా బిల్లుల చెల్లించారని ఆయన తెలిపారు.

కల్లూరులో 6న గ్రామీణ క్రీడా పోటీలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో శ్రీరామనవమి సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయం వద్ద యువకులకు గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఇసుక మూట, గుండు పైకి ఎత్తే పోటీలు, కర్రసాము పోటీలు, ఇరుసు ఎత్తే పోటీలు, బరువు పైకి ఎత్తే పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 9701141448, 9618083257 నంబర్లను సంప్రదించాలన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు.

కసాపురంలో అన్నదానం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి రథోత్సవం సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు, తంగుటూరు బ్రదర్స్ సహకారంతో చేపట్టిన ఈ అన్నదాన కార్యక్రమంలో దాదాపు వెయ్యిమందికి పైగా భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా రాచూరి శ్రీధర్ సహకారంతో వెయ్యి మజ్జిగ ప్యాకెట్లను వితరణ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రసిడెంట్ చక్కా జగన్‌మోహన్, సెక్రెటరీ తోయజాక్ష, సభ్యులు పాల్గొన్నారు.



గుత్తిలోని ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



తాడిపత్రిలోని కొత్త ఈద్గా మైదానంలో ముస్లింల ప్రార్థనలు



శింగనమలలోని ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

ఈద్ ముబారక్

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో సోమవారం ముస్లింలు రంజాన్ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈద్గా మైదానాలు, మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఖాజీలు, మతపెద్దలు అల్లాహ్ సందేశాన్ని వినిపించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా ఆశీర్వదించాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నిరుపేదలకు ధన, వస్తు రూపేణా దానధర్మాలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దర్గాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులను ప్రత్యేకంగా అలంకరించారు.

- ఘనంగా రంజాన్ వేడుకలు
- ఈద్గాల్లో సామూహిక ప్రత్యేక ప్రార్థనలు

గుంతకల్లు టౌన్/గుత్తి/గుత్తిరూరల్/తాడిపత్రి టౌన్/తాడిపత్రి రూరల్/ పెద్దపప్పూరు/ శింగనమల/యల్లనూరు/గార్లదిన్నె/పామిడి/ బుక్కరాయసముద్రం: గుంతకల్లులోని ఎస్‌జేపీ హైస్కూల్ వద్ద నున్న ఈద్గా మైదానం నందు పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ అబ్దుల్ రజాక్ పీర్ సాహెబ్ ఈదుల్ ఫితర్ ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గా మైదానం వద్ద స్థానిక ఎమ్మెల్యే జయరామ్ ముస్లింలను కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ నాయకులు ముస్లింలకు ఈదుల్ ఫితర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లింలు మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను శాలువాతో సన్మానించి స్వీట్ బాక్స్‌లను అందజేశారు.

▸▸ గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలాగే మండలంలోని కొత్తపేట, బసినేపల్లి, అబ్బేదొడ్డి, ఊటకల్లు, జక్కలచెరువు, రజాపురం గ్రామాల్లో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక సమాజులు చేశారు. అవాంఛీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

▸▸ తాడిపత్రి పట్టణంలోని కొత్త ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థన చేశారు. సీఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుజాగ్రత్తగా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, ఆయన సోదరుడు సురేష్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాషాను ఆయన నివాసంలో పలువురు ముస్లింలు, మైనార్టీ నాయకులు కలసి ఆయనకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

▸▸ పెద్దపప్పూరు మండలంలోని నరసాపురం, ముచ్చుకోట, చీమలవాగుపల్లి, పెద్దయక్కలూరు, పెద్దపప్పూరు, వరదాయపల్లి గ్రామాల్లో సోమవారం రంజాన్‌వేడుకలను ఘనంగా నిర్వహించారు. జామీయా మసీదు మతపెద్దలు ప్రవక్త గురించి వివరించారు.

▸▸ శింగనమలలోని ముస్లింలు ఆసరా కట్ట వద్దకు ఉదయం 8 గంటలకు చేరుకొని, అక్కడ నుంచి ర్యాలీగా వెళ్లి చెరువు వద్ద వున్న ఈద్గాలో ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలు అనంతరం గ్రామంలోకి తిరిగి వచ్చి దర్గాలో ప్రార్థనలు చేశారు. ఆదేవిధంగా తరిమెల, ఆకులేడు, పెరవలి ఈద్గాలో ముస్లింలు ప్రార్థనలు చేశారు.

▸▸ యల్లనూరు మండల కేంద్రంతోపాటు శింగవరం, కల్లూరు, పెద్దమల్లేపల్లి, వెన్నపూసపల్లి, చింతకాయమంద, తిమ్మంపల్లిలో భక్తిశ్రద్ధలతో ఖురాన్‌ను పఠించారు. కోడిమూర్తి వెళ్లేదారిలో చెరువు కట్ట వద్ద ప్రభుత్వ ఖాజీ మహ్మద్ అస్లాం, రషీద్ నూరీ ఆధ్వర్యంలో రంజాన్ ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, జాఫర్, హాజీవలి. షబ్బీర్‌బాషా, చాంద్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

▸▸ గార్లదిన్నె మండల వ్యాప్తంగా అన్నిగ్రామాల్లో రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు.

▸▸ పామిడిలోని. ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫేష్మామ్‌లు ఈదుల్‌ఫితర్ (రంజాన్) పండుగ విశిష్టతను వివరించారు.

▸▸ బుక్కరాయసముద్రంలో ముస్లింలు సోమవారం రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మత పెద్దలు మౌలానా హాఫిజ్, నబీరసూల్, రషీద్ సుల్తాన్, సులేమాన్, చాంద్‌బాషా, జావిద్ హుసేన్, యక్‌బాల్ సాహెబ్, మహమ్మద్ అలీ, పాన్‌భాషా, జిల్లాన్ అన్సర్, భాషా, బాబావలి, హుసేన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్



తాడిపత్రిలో ఫయాజ్‌బాషాకు స్వీట్ తినిపిస్తున్న ముస్లింలు



తాడిపత్రిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న రమేష్‌రెడ్డి



గుత్తి మండలం కొత్తపేటలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



యల్లనూరులోని ఈద్గాలో శుభాకాంక్షలు తెలియజేస్తున్న చిన్నారులు



గార్లదిన్నె మండలం కల్లూరు ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పామిడిలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బీకేఎస్‌లో రంజాన్ విశిష్టతను తెలియజేస్తున్న మత పెద్ద



పెద్దపప్పూరు ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పన్నుల వసూళ్లలో మొదటి స్థానం



మాట్లాడుతున్న కమిషనర్ శివరామకృష్ణ

తాడిపత్రి రూరల్: ప్రాపర్టీ, వాటర్ ట్యాక్స్ వసూలులో జిల్లాలోని మునిసిపాలిటీల్లో తాడిపత్రి మొదటి స్థానంలో నిలిచిందని కమిషనర్ శివరామక్రిష్ణ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం రాత్రి వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ మార్గాల ద్వారా మునిసిపాలిటీకి వచ్చిన ఆదాయం, వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మునిసిపాలిటీకి 2024–25 సంవత్సరానికి ప్రాపర్టీ ట్యాక్స్ కింద డిమాండ్ రూ.11.26 కోట్లు ఉండగా రూ.8.80 కోట్లు వసులై దాదాపు 86 శాతం సాధించామన్నారు. వాటర్ ట్యాక్స్‌లో డిమాండ్ రూ.4.87కోట్లకు గాను రూ.2.62 కోట్లతో 60 శాతం సాధించామన్నారు. సెలవు రోజులైన ఆదివారం, సోమవారాల్లో ప్రాపర్టీ ట్యాక్స్ రూ.35 లక్షలు, వాటర్ ట్యాక్స్ రూ.10 లక్షలు వసూలైందన్నారు. ట్యాక్స్ వసూలు కోసం ప్రత్యేకంగా సచివాలయం, మునిసిపల్ సిబ్బందితో కలిసి టీంలుగా ఏర్పాటు చేశామన్నారు. మునిసిపల్ కార్యాలయంలో అదనంగా మూడు కౌంటర్లను ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు.

అక్రమాలకు నిలయంగా 'ఉపాధి' పథకం



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

పుట్లూరు: ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు ఓ వరం. పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. కానీ గత కొన్నేళ్లుగా ఈ పథకం అక్రమాలకు నిలయంగా మారింది. ఈ విషయాన్ని సామాజిక తనిఖీల ద్వారా సామాజిక తనిఖీ బృందాలు బహిర్గతం చేసినప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. గ్రామాల్లో లేని వారు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసేవారి పేర్లతో రూ.5.75 లక్షలు అక్రమాలకు పాల్పడినట్లు 17వ సామాజిక తనిఖీ ద్వారా అధికారులు బహిర్గతం చేశారు. ఒక జాబ్ కార్డు ఉండాల్సిన కుటుంబానికి రెండు జాబ్‌కార్డులను మంజూరు చేసి పనిదినాలను పెంచుకున్నారని, ఒకే వ్యక్తి వందల కొద్దీ సంతకాలను, వేలి ముద్రలను వేసినట్లు గుర్తించామని సామాజిక తనిఖీ బృందం ద్వామా ఉన్నతాధికారుల ముందే స్పష్టం చేసింది. అయితే వీటిపై విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. ఇదేం అంత తప్పు కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిలో జవాబుదారీతనం కరువైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సామాజిక తనిఖీలో వెల్లడైన అంశాలపై లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

11న కల్యాణోత్సవం

శింగనమల: శింగనమలలోని పురాతనమైన రామాలయంలో ఈనెల 11న సీతారాముల కలాణోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకుడు సుబ్బరంగయ్య తెలిపారు. సోమవారం రామాలయంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాలపై చర్చించారు.

నేడు సోషల్ పరీక్ష

శింగనమల: శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు సోషల్ పరీక్ష జరుగుతుందని ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పరీక్షలకు విద్యార్థులందరూ హాజరు కావాలన్నారు.

వైభవంగా కోటకొండ ఆంజనేయస్వామి రథోత్సవం





కోటకొండ ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు, రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: కోటకొండ ఆంజనేయస్వామి రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని గోపురాజుపల్లి సమీపంలో వెలసిన కోటకొండ ఆంజనేయస్వామి తిరునాల ఆదివారం ఉగాది రోజు ప్రారంభమైంది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొళకతాళ్ల, గోపురాజుపల్లి, చిత్రచేడు, చిట్టూరు, రాంపురం, చిన్నవడుగూరు తదితర ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వాహనాలు, పెన్నారపు బండ్లల్లో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. నూతనంగా తయారు చేయించిన రథాన్ని లాగించారు. ఏటా ఉగాది పండుగ మరుసటి రోజు తిరునాల నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అంగళ్లు, తినుబండారాల దుకాణాల వద్ద మహిళలు, చిన్నారులతో కోలాహలంగా మారింది. తిరునాలను పురస్కరించుకొని చెక్క భజన, కట్టెల కోలన్న నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎస్ఐ ఆంజనేయులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆశా వర్కర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి



ఆర్థిక సాయం చేస్తున్న సీఐటీయూ నాయకులు

శింగనమల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన శింగనమల ఆశా వర్కర్ పద్మావతిని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం శింగనమలలోని ఆమె ఇంటికి సీఐటీయూ నాయకులు వెళ్లి పరామర్శించి, రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మాట్లాడుతూ గత నెల 15న వ్యాక్సిన్ తీసుకువస్తూ ఆమె రోడ్డు ప్రమాదానికి గురయ్యారన్నారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించకూడదని హెల్త్ కమిషనర్ ఉత్తర్వులు న్నా.. పనులు చేయిస్తున్నారన్నారు. ప్రమాదానికి గురైన పద్మావతి విధుల్లో చేరే వరకూ వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, నాగభూషణం, మురళి, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పు ప్యాకెట్ల చోరీ



ఉప్పు ప్యాకెట్ల డబ్బాను ఎత్తుకెళ్తున్న గుర్తు తెలియని మహిళ

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో మురళీకృష్ణ జనరల్ స్టోర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఓ ముసుగు ధరించిన మహిళ జనరల్ స్టోర్ బయట డబ్బాలో ఉంచిన 15 ఉప్పు ప్యాకెట్లను ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సీసీ టీవీ ఫుటేజీలో స్పష్టంగా రికార్డు అయ్యాయి. ఘటనపై దుకాణం నిర్వాహకుడు రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉప్పు ప్యాకెట్లను కూడా చోరీ చేస్తున్నారంటే గుత్తిలో దొంగల హడావిడి ఎలా ఉందో ఇట్టే స్పష్టమవుతుంది. పోలీసులు దొంగలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'బుగ్గ'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో బుగ్గ రామలింగేశ్వరస్వామి

తాడిపత్రి రూరల్ : పట్టణంలోని పార్వతీమాత, బుగ్గ రామలింగేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించిన అర్చకులు అభిషేకాలు చేశారు. పార్వతీమాతను ప్రత్యేకంగా పలు రకాల పూలమాలలతో అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పుట్లూరు: మండలంలోని నాయకునిపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే బండారు శ్రావణి పర్యటించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొననున్నట్లు ఆమె వివరించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని సోమవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వెనక కంపచెట్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు.. పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి పేక ముక్కలు, రూ.5.100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింల నిరసన

గుంతకల్లుటౌన్/తాడిపత్రి టౌన్: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నామని చాటిచెబుతూ గుంతకల్లులోని ముస్లింలు తమ ఐక్యతను ప్రదర్శించారు. వక్ఫ్ చట్ట సవరణను నిరసిస్తూ సోమవారం పట్టణంలోని ముస్లింలు చేతికి నల్లరిబ్బన్ ధరించి ఈద్గాల్లో జరిగిన రంజాన్ సామూహిక ప్రార్థనలకు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడాలన్నారు. అలాగే తాడిపత్రిలో రంజాన్ ప్రార్థనల్లో భాగంగా కొందరు ముస్లింలు నల్లరంగు రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. వక్ఫ్ చట్టం సవరణ బిల్లును వ్యతిరేకి స్తూ నల్లరిబ్బన్ ధరించి పార్థనల్లో పాల్గొన్నట్లు వారు తెలిపారు.

ఘనంగా బయన్నస్వామి ఉత్సవాలు

పుట్లూరు: దాదాపు ఎనిమిది సంవత్సరాల అనంతరం ఉగాది సందర్భంగా మడుగుపల్లి బయన్న ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గతంలో ఉత్సవాల సందర్భంగా గ్రామంలో వివాదం నెలకొనడంతో ఎనిమిది సంవత్సరాలుగా పోలీసుల నుంచి ఉత్సవాలకు అనుమతి లేదు. ఎట్టకేలకు గ్రామస్తులు ఐకమత్యంతో తమ ఇంటి ఇలవేల్పు బయన్న స్వామి ఉత్సవాలను నిర్వహించుకుంటామని కోరడంతో పోలీసుల నుంచి అనుమతి లభించింది. దీంతో గ్రామస్తులు ఆనందోత్సాహాలతో ఉత్సవాలను నిర్వహించుకున్నారు. బయన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఊరేగింపు చేపట్టారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు సత్యబాబు, శ్రీహర్షతో పాటు పుట్లూరు, యల్లనూరు, నార్పల, శింగనమల ఎస్ఐలు, 60 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పోలీస్‌స్టేషన్‌పై రాయి విసిరిన మందుబాబు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌పై మద్యం మత్తులో వున్న యువకుడు రాయి విసిరి పరారయ్యాడు. వివరాలు.. పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన మహబూబ్‌బాషా, సన్ని మద్యం మత్తులో గొడవ పడ్డారు. సన్ని రాయితో మహబూబ్‌బాషాను కొట్టడంతో తలకు గాయమైంది. స్థానికుల సమచారం మేరకు పోలీసులు ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకొచ్చారు. తలకు గాయమై రక్తం కారుతుండటంతో మహబూబ్‌బాషాను పోలీసులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మహబూబ్‌బాషాను వదిలి నన్ను స్టేషన్‌లో పెట్టుకుంటారా అంటూమద్యం మత్తులో ఉన్న సన్ని బయటకు వచ్చి స్టేషన్‌పై రాళ్లు విసిరి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో బావమరిదిపై దాడి

బుక్కరాయసముద్రం: మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో బావ రాయితో కొట్టడంతో బావమరిది గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఓబిలేసు, చిట్టి బావ, బావమరిది. సోమవారం ఇద్దరూ కలసి మద్యం సేవించారు. మద్యం మత్తులో బావమరిది తలపై బావ ఓబిలేసు రాయితో కొట్టాడు. స్థానికులు 108 వాహనంలో అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.